క్లుప్తంగా

ఆర్‌బీకేలకు చేరుతున్న ఎరువులు



చాటాయవలస ఆర్‌బీకేకు చేరిన ఎరువులు

రేగిడి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)కు యూరియా, డీఏపీ ఎరువులు వచ్చి చేరుతున్నాయి. ఎరువులు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి, తీసుకోవాలని ఏవో మురళీకృష్ణ తెలిపారు. ప్రతీ రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



బాలకవివలసలో సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని కొర్లవలస, మునకలవలస, బాలకవివలస గ్రామాల్లో లోన్‌యాప్‌లు, సైబర్ మోసాలపై ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు మంగళవారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చే ఆకర్షణీయమైన మెసేజీలు చూసి, మోసపోవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఏ విధంగా ప్రజలను బురిడీ కొట్టించి, మోసగిస్తారన్న విషయం తెలియజేశారు. తెలియని వ్యక్తులకు దూరంగా ఉండాలని, బ్యాంకు అకౌంట్ వివరాలు, ఏటీఎం పిన్ ఎవరికీ చెప్పవద్దన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ రాజారావు తదితరులు ఉన్నారు.

ఏకేఎల్ గెడ్డను బాగుచేయండి



వెంకంపేట వద్ద కుచించుకుపోయిన ఏకేఎల్ గెడ్డ

రేగిడి: మండలంలోని ఉనుకూరు–కొత్తచెలికానివలస గ్రామాల మధ్య ఉన్న ఏకేఎల్(ఆకులోవకట్ట)గెడ్డను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ గెడ్డలో పూడికలు అధికమవడంతో పాటు గెడ్డ గట్టుపై రెల్లిగడ్డి బాగా మొలిచిందని దీంతో సాగునీటి ప్రవాహం అంతగా జరగడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే గెడ్డ ద్వారా వెయ్యి ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోందని, అయితే ఇప్పుడు ఈ గెడ్డ కుచించుకుపోవడంతో సాగునీరు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. వరదలు వచ్చి, గెడ్డ గండికొట్టే లోపు గెడ్డను బాగు చేయాలని వారు అభ్యర్థిస్తున్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ

రేగిడి: చిన్నారుల శారీరక, మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, వైద్యశాఖ సంయుక్తంగా పిల్లల పెంపకం, సామాజిక అవసరం, కుటుంబం–సామాజిక అవగాహనపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె.. బాలల అభివృద్ధి, ఎదుగుదల, పౌష్టికాహారం, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

బాడంగి: సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో చిన్నారుల ఆరోగ్యం, వారి అందివ్వాల్సిన పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో మంగళవారం ఆంజనేయస్వామికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేకువజామున సీతారామస్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత... ఆలయంలో స్వామి ముఖద్వారం వద్ద కొలువుదీరిన ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంటను సాగు చేసేందుకు వీలుగా ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల ద్వారా చేపట్టిన వరి విత్తనాల పంపిణీలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయాధికారులు చూడాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మధుసూదనరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుని, మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాకాలం వస్తుండడంతో గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నందున వైద్యశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పశువులకు జడుపు, ఇతర వ్యాధులు రాకుండా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా ఎంపీడీవో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో విజయరాంపురం సర్పంచ్ బూరి మధుసూదనరావు మాట్లాడుతూ ఆర్‌బీకేలకు వచ్చిన ఎరువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏవో సునీల్‌కుమార్‌ను కోరారు. దీనికి ఆయన చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. గ్రామాల్లోని బడిఈడు పిల్లలు బడికి వెళ్లకుండా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ శాఖ సమీక్షలో తెర్లాంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ బోనెల రూప తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రమాదేవి, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చురుగ్గా విత్తనాల పంపిణీ



తెర్లాం ఆర్‌బీకే నుంచి వరి విత్తనాలు తీసుకువెళ్తున్న రైతు



బాడంగి ఆర్‌బీకేలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏవో శిరీష

తెర్లాం: మండల కేంద్రంలోని ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల్లో వరి విత్తనాల పంపిణీ చాలా చురుగ్గా జరుగుతోంది. తెర్లాం, టి.చిన్నయ్యపేట గ్రామాల రైతులకు మంగళవారం నుంచి వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే వీఏఏ శివకుమార్ రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఉదయం అందజేశారు. విత్తనాలు కావాల్సిన రైతుల వివరాలను గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నామని, పేర్లు ఉన్న రైతులందరికీ రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతోందని ఏవో తెలిపారు.

మరో 70 క్వింటాళ్లు తెప్పిస్తున్నాం..

బాడంగి: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు వరి విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. ఇప్పటికే 80 శాతం మంది రైతులకు విత్తనాలు అందజేయడం జరిగిందని, మరో 70 క్వింటాళ్ల విత్తనాలు తెప్పిస్తున్నామని మండల వ్యవసాయాధికారిణి కె.శిరీష తెలిపారు. విత్తనాలు చల్లే ముందు సూడోమోనాస్‌తో విత్తనాలు శుద్ధి చేసి వేసుకోవాలన్నారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ్

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో ఎస్.హరనాథ్ తెలిపారు. మండలంలోని లచ్చారాయపురం గ్రామంలోని గిరిజాలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న వారు మాత్రమే ఉపాధి పనులకు రావాలన్నారు. పనిలో ఉన్న వారికే మస్టర్లు వేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉంటే రెండుపూటలా చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేసుకోవాలన్నారు. పనుల్లో ఉండగా వర్షం వచ్చే సూచనలుంటే వెంటనే ఇంటికి వెళ్లిపోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సాయిప్రశాంత్‌కుమార్

రేగిడి: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, అలా చేస్తే విద్యాబుద్ధులు అలవడతాయని రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం ఆదర్శ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సాయిప్రశాంత్ తల్లిదండ్రుల పేరున జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషి చేయాలన్నారు. బాల్యం నుంచే పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకుని, ఉత్తములుగా సమాజంలో గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురపాక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ భవనం పరిశీలన



రాజాం సిటీ: భవనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



బొబ్బిలి: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలో గతంలో అన్నా క్యాంటీన్‌గా వినియోగించిన భవనాన్ని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. రూ.15 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఏఈ వెంకట్‌కు సూచించారు. సెప్టెంబర్ 21వ తేదీన ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, ఈ భవనాన్ని ఇటీవల పురపాలక సంఘానికి చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి కేటాయించారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని అన్నా క్యాంటీన్ భవనం మరమ్మతులకు రూ.5 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపించామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం తెలిపారు. గతంలో నిర్మించిన ఈ భవనానికి రూఫింగ్ తదితర పనులు చేపట్టాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించిన ఫర్నిచర్ గతంలో కనబడుటలేదని అంతా అనుకున్నారని, కానీ మున్సిపల్ మస్తరు కార్యాలయంలో ఈ ఫర్నిచర్ వినియోగిస్తున్నట్లు తెలిసిందన్నారు. వారం రోజుల్లో మరమ్మతుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

5513 మందికి స్టూడెంట్ కిట్లు



ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు తరలిస్తున్న దృశ్యం

రాజాం: మున్సిపాలిటీతో పాటు మండలంలో మొత్తం 5513 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు వచ్చాయని, వీటిని ఆయా పాఠశాలలకు తరలించి, పంపిణీ చేస్తున్నామని ఎంఈవోలు బి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు తెలిపారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి మండలంలోని పలు పాఠశాలలకు వాహనాల ద్వారా స్టూడెంట్ కిట్లు మంగళవారం తరలించారు. ప్రభుత్వ పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో విద్యార్థుల హాజరు శాతం మేర ఈ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

శతశాతం ఉత్తీర్ణత

వంగర: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు మంగళవారం తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో 30 మంది, బైపీసీ గ్రూప్‌లో 25 మంది, సీఈసీ గ్రూప్‌లో 10 మంది, హెచ్‌ఈసీ గ్రూప్‌లో ఆరుగురు చొప్పున మొత్తం 71 మంది హాజరు కాగా వారంతా ఉత్తీర్ణులయ్యారన్నారు.

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.జనార్ధనరావు తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో 20 మంది, బైపీసీ గ్రూప్‌లో 34 మంది, సీఈసీ గ్రూప్‌లో 14 మంది, హెచ్‌ఈసీ గ్రూప్‌లో 13 మంది చొప్పున మొత్తం 81 మంది హాజరు కాగా వారంతా ఉత్తీర్ణులయ్యారన్నారు.

ఎమ్మెల్యే పరిశీలన



ఆమిటి వద్ద తోటపల్లి పిల్లకాలువ గండిని పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామానికి సమీపంలో తోటపల్లి పిల్లకాలువకు గతేడాది పడిన గండిని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీనాయన) మంగళవారం పరిశీలించారు. గండి పడిందని స్థానిక నాయకులు, రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన దానిని పరిశీలించి, మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కాలువ ద్వారా ఎన్ని గ్రామాలకు సాగునీరు వెళ్తుందని, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సాగుకు పిల్లకాలువ ద్వారా సాగునీరు విడుదల చేయకముందే కాలువను బాగుచేయాలని అధికారులకు తెలిపారు. పిల్లకాలువ మరమ్మతు పనులకు అవసరమైన నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ ప్రతినిధి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

బాడంగి: చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన.. సచివాలయాల్లో గతంలో స్పందన పేరిట నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు బదులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పేరిట గ్రీవెన్స్ చేపట్టాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలన్నారు. పంచాయతీ అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ విధిగా పాటించాలన్నారు. పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. గ్రామాల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలు తిరిగి పనిచేసేలా చూడాలన్నారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయండి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విద్యార్థుల తల్లిదండ్రులంతా విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి జె.త్రినాధరావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి తల్లిదండ్రుల కమిటీ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడి బయట ఉండకుండా, వారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే చేయడం జరుగుతోందన్నారు. సమావేశంలో పాఠశాలల హెచ్‌ఎంలు, తల్లిదండ్రులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలి

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



ఏవో వెంకటయ్యతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవో వెంకటయ్యతో మంగళవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఇబ్బంది పడకుండా వారికి అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. అనంతరం ఏవో మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్‌బీకేలలో వరి విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులకు అవసరమైన 750 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేశామని, అవి ప్రస్తుతం పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంటీయూ 1121, ఎంటీయూ 1064, సోనామసూరి, సాంబమసూరి, ఆర్జేఎల్ విత్తనాలతో పాటు ఎంటీయూ 1224, ఎంటీయూ 1518 కొత్త రకం వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామని, కావాల్సిన రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే ఆర్‌బీకేలలో 150 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్‌లో 450 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. అలాగే 60.8 క్వింటాళ్ల కట్టిజనుము, పిల్లిపెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు.

• పైనాపిల్.. పోషకాలు ఫుల్!





రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలి, కూరగాయల మార్కెట్‌లో లభించే పైనాపిల్‌కు విశేషాదరణ లభిస్తోంది. రుచితో పాటు అనేక పోషకాలు విలువలు కలిగిన ఈ పండ్లను తినేందుకు అందరూ ఇష్టపడుతుంటారు. ఈ నేపథ్యంలో వీటికి మంచి డిమాండ్ ఉంది. ఒక్కో పండు రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు మామిడిపండ్ల సీజన్ నడుస్తోందని, మరో వారం రోజుల్లో పైనాపిల్ అమ్మకాలు జోరందుకుంటాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– రామభద్రపురం

మురుగునీటిని తరలించేలా ట్రెంచ్‌ల ఏర్పాటు



గాంధీనగర్ వద్ద ప్రొక్లెయిన్‌లతో ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రాజాం: పట్టణంలోని పలు వార్డుల్లో మురుగునీటితో పాటు వర్షపునీరు నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. స్థానిక పట్టణంలోని పలు వార్డుల్లో ఇటీవల వర్షాలకు నిల్వగా ఉండిపోయిన నీటిని ట్రెంచ్‌లు ఏర్పాటు చేసి, మురుగుకాలువల్లోకి తరలించారు. అక్కడక్కడ అధ్వానంగా ఉండిపోయిన మురుగుకాలువలను బాగుచేయించడం, ఒక కాలువతో మరో కాలువకు నీరు వెళ్లేలా ప్రొక్లెయిన్‌తో లైనింగ్ పనులు చేయించారు. పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండడంతో పాటు వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వంగర: మొక్కలు నాటాలని కోరుతూ చార్టులు ప్రదర్శిస్తున్న చిన్నారులు పక్కనే అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజని



రాజాం: వీఆర్ అగ్రహారం పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

వంగర: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజని అన్నారు. మండలంలోని మగ్గూరు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టి, మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్క నాటి, సంరక్షించాలని కోరారు. మొక్కలు నాటడంతోనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అప్పలనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని వీఆర్ అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. పాఠశాలలో మొత్తం పది మొక్కలు నాటామని, వీటిని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి అందించిందన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 15 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 40 మంది కంటి రోగులు హాజరుకాగా వారికి ఆప్తాలమిక్ అధికారి వసంతరావు, రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు, ఆప్తాలమిక్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు కలిసి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఉచిత నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు సమన్వయకర్త సత్యనారాయణ, సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.